
వర్షం
ముప్పిరాల
శ్రీధరమూర్తి

వర్షం—

జోరుగా వర్షం—
చల్లగా, అమృతపు జల్లులా
ముత్యాల సరాల్లా,
ముద్దుగా వర్షం.

బయట, పరచివున్న పచ్చని తివాసీ లాంటి లాన్‌లో. గడ్డిమొక్కలు వంగుతూ, లేస్తూ షోగ్గా, నృత్యం చేస్తున్నాయ్.

గడ్డిమొక్క కొసన నిల్చున్న, వర్షపు బిందువు ఫ్లడ్ లైట్ (Flood light)లో, పెళ్ళికూతురి ముక్కు పుడకలా మెరిసి పోతూంది. క్రోటన్ మొక్క నంటిపెట్టు కున్న, ఒంటి పువ్వు జ్ఞానోదయమైన మనసులా ఎర్రగా నిల్చొని వుంది.

గులాబీ మొక్కలు ఉర్దూ కవితా సుంద రిలా కళ్ళకు మత్తెక్కిస్తూన్నాయ్.

మేడపైన, అద్దాల గదిలో—

"చూశావా శేఖర్: లాన్ మీది నీటి బిందువుల్ని అలా చూడు. సీ దట్ డెలికసీ (See that delicacy) ఉర్దూలో దీన్నే "షబ్నం" అంటారు."

"అరే, ముకుంద్, పదింటికల్లా వస్తా మన్న వీళ్ళిద్దరూ, ఎనిమిదయినా రారే? ఎక్కడ మజా చేస్తున్నారో!"

బ్రాందీ బుడ్డిని చూస్తూ కూర్చోటం చాలా కష్టం. రెండు ప్రారంభిద్దామంటే వీళ్ళొచ్చి చావరు, ఎలా."

"చాలా బోర్డం (Boredum) గా వుందోయ్ ఈ రోజు?"

"కంపెనీ లేక, అంతేగా?"

"అదొక కారణం అనుకో, అప్పటికే ఫోను చేశాను ఆఫీసు నించి. అంతా బుక్కయి పోయారట, ఈ రాత్రికి. ఈ రోజంతా ఇలాగే వంటరిగానే దాటె య్యాలి."

"అదేం? ఈ రోజు బజారు సరుకు మీదెందుకు పడ్డావ్? నీ ఓ. సీ. లన్నీ ఏం అయినట్లు?"

"ఆఁ, ఏం ఓ. సి. లో ఎప్పుడూ ఒక అవాంతరం. అనుకోనట్లు ఎవరో ఒకరు తగలడుతూంటారు వాళ్ళ ఇళ్ళల్లో. మిసెస్ జాన్ ఫోనులో సారీ చెప్పింది. జాన్ ఈ రోజే కాంప్ నించీ, వచ్చాడట. శాంతికి గెస్టు లొచ్చేరట. ఏం మునిగి పోయిందనో వీళ్ళంతా ఈ రోజు ఇలా కట్టకట్టుకొని వచ్చి పడ్డారు."

"అందుకనేగా, నేను నీ కెప్పుడూ చెపుతూ వుండటం, నీదంటూ పిల్ల నొక దాన్ని పెళ్ళాడమని."

"అఘోరించావ్‌లే! గంగలో దూక మని చెప్పావు గాదు. అసలింతకీ, నీ సలహా నువ్వే పాటించవు ఎందుకు?"

నా సంగతి అలా వదిలెయ్. నా పెళ్ళి

బాటిల్తో ఎప్పుడో అయిపోయింది. కానీ ఈ లోన్లినెస్ (loneliness) నన్ను చాలా బాధ పెడుతూంది. త్రాగుబోతు మొగుణ్ణి ఏ ఆడదయినా సహిస్తుందంటావా?"

"అలా అనుకోకు. త్రాగుబోతు గూడా ఒక మంచి భర్త కాగలడని ఏదో కథలో చదివాను, ఇటీవల."

"డామ్. పేదవాళ్ళలో లేని మంచిని భూతద్దంలో చూపెట్టే కథలవి. కూలి వెధవల్ని పని చెయ్యకుండా తిరగబడమని ప్రబోధించే కథల కేమీ తక్కువలేదు. ఈ దేశంలో."

అరె పదవుతోంది. వీళ్లేవవయినట్లు? ఇంకా వీళ్ళకోసం కాచుక్కూచోటం మియర్ ఫూలిష్ (Mere foolish) కమాన్, గొంతు తడుపుకుందాం.

* * *

వర్షం——

ఇంటా బయటా వర్షం——

చూర్లోంచి కారే నీటి కంపు——

పొగ చూరిన గోడల మీదుగా, వాన నీళ్ళ చెమట కంపు——

పై కప్పులో ఎలుకల గోల——

అవి జారి కింద పడ్డప్పుడు, టప్పున శబ్దం.

"అరెరే, చంటివాణ్ణి ఇలా జరుపు లక్ష్మీ! తడిపి పోతున్నాడు, వెధవ."

ఆఁ వస్తున్నా. ఏవండీ మిమ్మల్నే! వంటింట్లో బిందె అలా ఆ చూరు కింద పెట్టండి. కొంపంతా చెరువయి పోతూంది, మరీ."

ఆకాశం నించే పెళ్ళున ఉరుములు.

"లక్ష్మీ, రెండోదాన్ని చేతికెత్తుకో. జడుసుకొన్నట్లుంది. పాపం!"

"ఇదిగో, వీడికి పాలిచ్చి.... ఈ నెలైనా కాస్త పెంకులు తిరగేయించమని చెప్పండి. రాత్రంతా నిద్ర లేకుండా, ఎన్నాళ్ళిలా జాగారం? అసలిదంతా మీ మెత్తదనం వల్లనే. ఇల్లుగలాయన్ని మీ రెప్పుడైనా నిలేసి అడిగిన పాపాన పోయారా? అమ్మయినా అడగందే పెట్టదు కద. ఈ కొంప ఎప్పుడో మనందరి మీద కూలి తీరుతుంది అంతటితో విముక్తి. ఛీ ఛీ. ఏం బతుకులు."

ఇటు తిరిగి పడుకొన్న సుబ్బారావుకు అన్నీ వినిపిస్తూనే వున్నాయ్.

పాపం! లక్ష్మికి అసలు కిటుకు తెలీదు. ఇప్పటికే తను నాలుగు నెలల అద్దె బాకీ. ఇక, ఏ మొహం పెట్టుకొని రిపేరు చేయించమని అడగటం? అంత వరకూ ఆయన పెద్ద మనిషి. తనను, భార్యా బిడ్డల్తో బైటికి గెంటేసి, రోడ్డెక్కించ లేదు.

ఎప్పుడో పదేళ్ళ క్రితం, తన కాలేజీ రోజుల్లో చదివినకవిత్వం గుర్తుకొచ్చింది, సుబ్బారావుకు.

"కలల పంచనిండీ కారే సంతృప్తి ధార నిద్దుర బిందెలలోనైనా, పట్టుకొనీ యండి. నిత్తినైమిత్తికాల వంటింట్లో చూరునించి లేమి కారుతోంది చూడండి

పరిస్థితుల పెంకులు తిరగవేయించండి.''

ఆ రోజుల్లో ఎంత తర్జన, భర్జనలా పుస్తకం మీద. ఇంతకీ, పుస్తకం పేరేమిటబ్బా? ఊ' గుర్తుకు రావడం లేదు.

మొదటిసారి ఆ పుస్తకం చదివినప్పుడు, తనకెంత ఆనందం. ఎంత ఉత్సాహం!

ఈ రోజు, తన అనుభవంలోకి అదే వచ్చేసరికీ, ఎంత బాధ.

కాలేజీలో నేర్చుకున్నవి ఈ బతుకులో ఏం పనికొచ్చాయ్?

ఎన్ని ఆదర్శాలు ఆ రోజుల్లో! ఎంత ఆవేశం! ఏదేదో చేసెయ్యాలని ఎంత తపన! రోజు కొక పూట కూడా కూడు లేనివాళ్ళు 75 శాతం వుంటూన్న ఈ దేశాన్ని, మరమ్మత్తు చెయ్యాలని, ఈ దారిద్ర్యం కరుపును మొదలంటా కడిగెయ్యాలని. ఉబలాటం!

కానీ, ఈ రోజిలా ఈ గ్లోరిఫైడ్ నేమ్ ఫర్ స్లేవరీలో (glorified name for slavery) తనకూ, ఇతర్లకి పనికి రాని బరువు బతుకును మోస్తూ, తన దరిద్రం, అసఖ్యత, కనీసం భార్యకు గూడా తెలియనీని వానిటీ, (vanity) ఫాల్స్ ప్రెస్టిజ్ (False prestige) లో ఎన్నాళ్ళు ఇంకా ఎన్నేళ్ళు?

అని ఆలోచిస్తూ, తడపని కాస్త చోటుకోసం చీకట్లో తడుముకుంటూ వుండిపోయాడు, సుబ్బారావు—ఇంటర్ యూనివర్శిటీ ఎలెక్యూషన్ పోటీలో గోల్ మెడల్ విన్నర్.

*　　*　　*

వర్షం—

భోరున వర్షం—

టి. బి రోగి దగ్గుతూన్నట్లు ఉండీ ఉండీ, ఉరుములు—

మెరుపు వెలుగుల్లో కాలవనీటి కంపు నీళ్ళు, గజ్జికుక్కలు పందులు—

నేలంతా తడి, చిత్తడి.

చిత చితలు, పటపటలు.

"ఒసే కనకం, ఒక రూపాయుంటే ఇయ్యవే! గిరాకీ తగలగానే తిరిగిచ్చేస్తాను ప్రొద్దిటినించీ కూటికి నోచుకోలేదు, నేను.''

"మన బతుకుల్ని దరిద్రం పట్టు కొన్నట్లు, ఈ వూరిని ఈ వాన పట్టుకొంది. ఇంత వర్షంలో ఏ మగాడూ ఈ పేటకేసి రాడు. వస్తావన్నా, రిషావాళ్ళు ఇటుకేసి రారు. ఎవరి కడుపు నింపుతుందో తెలీదు గానీ, ఈ యేళ మన కడుపు గొడుతూంది ఈ వాన నయాపైస కళ్ళ జూపి నాలుగు రోజు లయింది.''

"కొట్లో తోసేస్తానని హంగామా చేసి, బొడ్లో వున్న రెండు రూపాయలూ పీక్కు పోయాడు, పోలీసెంకటసామి.''

"మొన్న తీసుకున్న ఇంజీషన్కి ఇంకా డబ్బు లీలేదని, బూతులు తిట్టి పోయాడు. కంపోండరు రాజయ్య.''

"పోయిన్నెల కాతాలో బాకీ పెట్టేనని, మెడ బట్టుక గెంటేశాడు, టీ కొట్టువాడు.''

"తాగడానికి డబ్బులీ లేదని, చితక

తన్ని పోయాడు, రంగడు.''

"ఛీ! ఏం బతుకులే? మనవేం బతుకులే, కనకం! మానం అమ్ముకొని మడి మాన్యాలు సంపాయించారట, మునుపు, మనలాంటోళ్ళు. ప్చ్! ఆ రోజు లెల్లి పోయాయ్. మానం పోతే పోయింది, మండే కడుపు మండుతూనే ఉంది. కొత్తల్లో ఏడవడానికి కళ్ళ నిండా కడవల నీల్లుండేయి. ఇప్పుడవీ లేవ్! ఏం బావుకుందామని ఇంకా బతకటం?''

"ఏమే? డబ్బు లడిగితే ఇలా రాయిలా నిల్చుంటావేం? కడుపులో ఎలికలు తిరుగుతూంటేనూ.''

''నాకాడ ఎక్కడివే డబ్బులు, సరసా. నివ్వేదో ఏదాంతం జెబుతూంటే. మరిం కేదో గుర్తుకొచ్చి, ఆలోచిస్తూన్నా.''

"నిన్ననేగా, గాంధీ లాడ్జి కెల్లొచ్చావ్? ఏమైపోయిన వెంటి డబులన్నీ, నా కాడ ఎర్రేసాలు ఏస్తావుటే. కనకం!

"ఆ చెప్పొచ్చావ్లే, సంబరం. పది రూపాయ లిస్తామన్న నాయాళ్ళు పనయి పోయాక మూ(డ్రూపాయలు చేతిలో పెట్టారు. ఇదెం నాయం అనడిగతే తన్ని తగలేశారు, సచ్చినోళ్ళు ,(బోకరు నాయాలు అందులో రూపాయిన్నర, జుట్టు పుచ్చుక తీసుకుపోయాడు. ఇహనా కాడ, మిగిలిం దేవిటే, ఎర్రి మొగమా?''

"నువ్వు బతుకుని సాగదీసి ఆలోచిస్తున్నావింకా, నేనా పని ఎప్పుడో మానేశాను. బతుకెలా తోస్తే. అలా వంగి, కాస్త నిల(ద్రొక్కుకొని పొట్ట నింపుకోడమే మన పని.''

''అదిగాక, మనవేం బతుకులు, ఎందుకు పుట్టేం, ఏం బావుకుందావని, ఇంకా బతుకుతున్నా, అని ఆలోచిస్తూ కూర్చున్నావో, నీకు రెండ్రోజుల్లో పిచ్చెత్తి పోతుంది. లేకుంటే దేవుడు సల్లగా సూస్తే, బుర్ర బద్దలై సచ్చి పోతావ్. ఇంటూన్నావే సరసా?''

వర్షం, భోరున వర్షం.

ఆకాశం ఏడుస్తూంది. కడుపు లేడుస్తూన్నాయ్.

కళ్ళు వర్షిస్తూన్నాయ్.

కడవలు, కడవలు——

కన్నీళ్ళ కడవలు——

కళ్ళలో కన్నీళ్ళ కడవలు——

వర్షం.

---

**జంతు లక్షణం :-**

"24 కాళ్లు, 24 చేతులు, ఎర్రటి కళ్లు, రెండు కోరలు ఉండు పచ్చగా వుండే దాన్నేమంటారు?"

"నాకు తెలియదు-'' ఏమంటారు?"

"నాకూ తెలియదుగాని, నీ కాలరుమీద పాకుతోంది."